క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

వినుకొండ: వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని కోరుతూ స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. స్థానిక సురేష్ మహల్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో తాగునీరు సాగునీరు లేక వలసలుపోతున్న ప్రాంతం, పశువులకు నీళ్లు దొరకని ప్రాంతం బొల్లాపల్లి మండలం, ఎగువ పల్నాడు ప్రాంతం, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు ప్రాంతాలకు ప్రధానంగా ఉపయోగకరంగా ఉండే వరికపూడిశెల ప్రాజెక్టును సాధించుకోవాలని తెలిపారు. ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

ఆలపాటి తరపున ఎమ్మెల్యే జూలకంటి ప్రచారం



విజయపురిసౌత్: గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రులు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. శుక్రవారం విజయపురిసౌత్‌లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. టీడీపీ మండలాధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు గెలిపించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం రెంటచింతలలోని వివిధ పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. మండలంలో మొత్తం 833 మంది పట్టభద్రులైన ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉందని తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మాచర్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం బయట ఓ వ్యక్తి మృతి చెందడంతో..ఆ అనాథ శవానికి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం మున్సిపాలిటీ సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.50 ఏళ్లు ఉన్న ఆ పురుషుడి శవాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమందించారు. గత ఐదు రోజులుగా వివిధ రకాలుగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరూ ఆచూకి కోసం ముందుకు రాకపోవడంతో అంత్యక్రియలు జరిపారు.

చర్చి వార్షికోత్సవ ప్రత్యేక ప్రార్థనలు

మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీ వెనుక, కేవీఆర్ గార్డెన్స్ సమీపంలో లయోల ఇవాంజిలికల్ ఫెలోషిప్ 7వ వార్షికోత్సవ సువార్త సభలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏసు ప్రభువు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను సంఘ పెద్దలు నిర్వహించారు. పలువురు చర్చి పాస్టర్లు బోధనలు చేశారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు. శనివారం ముగింపు వార్షికోత్సవంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి చర్చి పాస్టర్లు, పలువురు పాల్గొని ప్రత్యేక బోధనలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చర్చి నిర్వాహకులు, పాస్టరు కోరారు.

స్వచ్ఛాంధ్రపై దృష్టి సారించాలి

పిడుగురాళ్ల: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు ఈ కార్యక్రమంపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రతి మూడవ శనివారం పట్టణంలోని 33 వార్డుల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హజరత్ సుభాని దర్గా ఉరుసు మహోత్సవం



నాదెండ్ల: అప్పాపురం గ్రామంలో కొలువైయున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం గంధమహోత్సవం, సాయంత్రం సుమారు 20 వేల మందికి భారీ అన్నదానం చేయనున్నారు. దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

పల్నాటి విప్లవ కెరటం కన్నెగంటి

- నేడు 103వ వర్ధంతి
- సహాయ నిరాకరణోద్యమ స్ఫూర్తి..
- హనుమంతు పిలుపుతో పల్నాడులో 'పుల్లరి' నిరాకరణోద్యమం

దుర్గి: స్వాతంత్ర్య పోరాటంలో పల్నాటి నేల సాక్షిగా చరిత్రకెక్కిన మహోద్యంలో చెప్పుకోదగిన విప్లవ కెరటం కన్నెగంటి హనుమంతు. ఆయన నేతృత్వంలో పల్నాటి ప్రాంతంలో బ్రిటీషు మూకలను గడగడలాడించిన 'పుల్లరి' ఉద్యమం గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాల్సిందే. శనివారం ఆయన 103వ వర్ధంతి సందర్భంగా మరోసారి స్మరించుకుందాం.

కన్నెగంటి హనుమంతుది దుర్గి మండలం, మించాలపాడు గ్రామం. కన్నెగంటి వెంకటయ్య, చిన అచ్చమ్మలకు 1885 ఏప్రిల్ 18న రెండవ సంతానంగా జన్మించారు. హనుమంతు కుటుంబం 80 ఎకరాల వ్యవసాయ భూమి కలిగిన సంపన్న కుటుంబం. ఆయన విద్యాభ్యాసం వెల్దుర్తి మండలంలోని రచ్చమలపాడు గ్రామంలో బంధువుల వద్ద సాగింది. బాల్యం నుంచి చురుకుగా ఉండే కన్నెగంటికి విలు విద్య, వడిశలు విసరడంలో మంచి ప్రావిణ్యత ఉండేది. అడవి జంతువుల వేటపై ఆసక్తి కలిగి ఆయన రూ.110 ఖర్చుతో ఒక తుపాకి చేయించుకున్నారు. 1902లో రెంటచింతలను సందర్శించిన అమెరికన్ రోమన్ క్యాథలిక్





కన్నెగంటి ఘాట్ వద్ద నూతనంగా నిర్మించిన విగ్రహం (ఇన్‌సెట్‌లో) కన్నెగంటి హనుమంతు

బిషప్ పులి చర్మం బహూకరించినందుకు కృతజ్ఞతగా హనుమంతుకు విదేశీ రైఫిల్‌ను కానుకగా ఇచ్చారు. ఆరడుగులు రెండు అంగులాల ఎత్తు ఉండి, కోర మీసం కలిగిన హనుమంతు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తారు. 1920 డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సార్వత్రిక సభల వేదికలో జాతిపిత మహాత్మాగాంధీ పిలుపునందుకొని సహాయ నిరాకరణ ఉద్యమాన్ని పల్నాటి ప్రాంతంలో హనుమంతు ముమ్మరంగా ప్రచారం చేశారు.

అక్కడ సహాయ నిరాకరణ.. ఇక్కడ 'పుల్లరి'

సహాయ నిరాకరణ ఉద్యమ పర్యాయమే పుల్లరి ఉద్యమం. అటవీ ప్రాంతంలో వంట చెఱకు తెచ్చుకున్నా.. పశువుల మేతకెళ్లినా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం పుల్లరి పన్ను వసూలు చేసేది. కన్నెగంటి పిలుపుతో ప్రజలు పల్నాడులో ఈ శిస్తుకు ప్రజలు నిరాకరించారు. శిస్తు వసూలు చేసే ఉద్యోగులపై తిరగబడే స్థాయికి చేరుకున్నారు.

తుపాకి గుళ్లతో..

ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న హనుమంతు అధికారులను సమీపిస్తున్న కరణం సదాశివయ్య చూపుడు వేలుతో చూపిస్తూ అతడే హనుమంతు అని చెప్పాడు. అతను తమ దగ్గరకొస్తే ప్రాణాలతో బతకనియ్యడని, అతని వద్ద రైఫిల్ ఉందంటూ ఎస్‌ఐని రెచ్చగొట్టాడు. దీంతో బ్రిటీషు సైనికులకు ఎస్‌ఐ కాల్పుల సంకేతమిచ్చాడు. సాయుధ దళాలు తుపాకులు పట్టడం గమనించిన హనుమంతుకు ఏమి చేయాలో పాలుపోలేదు. తేరుకునేలోపే ఒక్కసారిగా తుపాకులన్నీ పేలాయి. రక్తపు మడుగులో హనుమంతు కుప్పకూలాడు. సాయంత్రం 4, 5 గంటల మధ్య కాల్పులు జరిగితే అదే రోజు అర్ధరాత్రి వరకు ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. ఆయన సతీమణి గంగమ్మను కూడా ఘటన స్థలానికి అనుమతించలేదు. హనుమంతుతో పాటు తన అనుచరుడు యల్లంపల్లి శేషయ్య కూడా తుపాకి తూటాలకు నేలకొరిగారు.

ఖండించిన ఆంధ్ర కమిటీ

1924 అక్టోబర్ 19న జరిగిన జాతీయ ఉద్యమ కాంగ్రెస్ ఆంధ్ర కమిటీ సమావేశం హనుమంతు హత్యను ఖండిస్తూ ఘనంగా నివాళులర్పించింది. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపింది.

కన్నెగంటిని మట్టుపెట్టేందుకు.. పథక రచన

కన్నెగంటి హనుమంతు పిలుపునందుకొని బ్రిటీష్ ప్రభుత్వం పన్నులను నిరాకరించటంతో 1922 ఫిబ్రవరి 2న పుల్లరి ఉద్యమం అణచివేసేందుకు ప్రత్యేక అధికారిగా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. ఆయన నేతృత్వంలో సాయుధ సైనిక పటాలం, అశ్వదళం.. తాలూకా కేంద్రం గురజాలకు చేరుకుంది. ఫిబ్రవరి 22న దుర్గి పోలీసు స్టేషన్ నుంచి అశ్వదళం, రిజర్వ్‌డ్ పోలీసు దళం, సైనిక పటాలం, 20 మంది కానిస్టేబుళ్లు.. దుర్గి ఎస్‌ఐ జీవీ రాఘవయ్య నేతృత్వంలో సాయంత్రం 4గంటలకు మించాలపాడు గ్రామం చేరారు. అదే రోజు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు కోటప్పకొండకు తరలి వెళ్లారు. బ్రిటీషర్లు హనుమంతును గుర్తించేందుకు ఆ గ్రామానికి చెందిన కరణం యడ్లపల్లి సదాశివయ్య సహాయం తీసుకున్నారు. శాంతియుత చర్చల పేరుతో హనుమంతుకు కరణం ద్వారా కబురు పంపారు.

భావితరాలకు స్ఫూర్తి

నేతలు కన్నెగంటి ఘాట్ వద్ద హనుమంతు జీవిత విశేషాలతో ఒక స్మారక చిహ్నంగా రూపొందించి, భావితరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. కన్నెగంటి ఘాట్‌ను అభివృద్ధి పరచి, ఆయన వర్ధంతి, జయంతులను ప్రభుత్వం ఘనంగా జరిపేలా కృషి చేయాలని కోరుతున్నారు.

చారిత్రాత్మక ప్రదేశంగా అభివృద్ధి చేయాలి



ప్రభుత్వాలు స్వాతంత్ర్య సమరయోధులకు తగిన గుర్తింపు ఇవ్వాలి. కన్నెగంటి స్మారక స్థూపాన్ని అభివృద్ధి పరచి ఆయనకు ఘనంగా నివాళులర్పించాలి. నేటి పౌరులకు దేశభక్తిని పెంపొందించే విధంగా కృషి చేయాలి. హనుమంతు జీవిత చరిత్రను పుస్తకాలలో ప్రచురించే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు పూనుకోవాలి.

– ఆకుల లక్ష్మయ్య, సభ్యుడు, కన్నెగంటి హనుమంతు సేవా సమితి

న్యాయవాదుల విధుల బహిష్కరణ

మాచర్ల: దేశవ్యాప్తంగా న్యాయవాదుల బాధ్యతలు తగ్గించి, విధి విధానాలకు ఇబ్బంది కలిగించేలా అడ్వకేట్ ప్రాక్టీస్ పై తీసుకొస్తున్న సవరణ చట్టాన్ని నిరసనగా రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపు మేరకు రెండవ రోజు శుక్రవారం పట్టణంలోని మున్సిఫ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులంతా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం విధులకు హాజరైన వారు కోర్టు జడ్జిలు శ్రీరాం, శ్రీనివాస్ కల్యాణ్, పి.ప్రశాంత్ లకు వినతిని తెలియపరచారు. ఈ సందర్భంగా పలువురు బార్ అసోసియేషన్ సంఘ నాయకులు మాట్లాడుతూ న్యాయవాదుల విధుల సవరణ చట్టం తమ బాధ్యతల విషయంలో ఆటంకమన్నారు. న్యాయవాదులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.

పీహెచ్‌సీలకు వీల్‌చైర్స్



సాక్షి ఎఫెక్ట్

మాచర్ల రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న వీల్ చైర్స్‌పై ''సాక్షి''లో ఈ నెల 20న కథనం వచ్చింది. అధికారులు శుక్రవారం స్పందించి వీల్‌చైర్స్‌ను మండలంలోని తాళ్ళపల్లి, కొప్పునూరు, కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. ఎన్నికల విధుల్లో దివ్యాంగుల కోసం కొనుగోలు చేసిన వీల్‌చైర్స్‌ను.. అప్పటి జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీలకు అందించాలని ఆదేశాలిచ్చారు. 8 నెలల తర్వాత నిరుపయోగంగా ఉన్న వీల్ చైర్స్‌ను ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్ ఆదేశాల మేరకు కొప్పునూరు పీహెచ్‌సీకి అందించినట్లు వైద్యులు వెల్లడించారు.

టెన్త్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

రెంటచింతల: మార్చిలో 10 వతరగతి పరీక్షలను మండల కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరావు తెలిపారు. శుక్రవారం జెట్టిపాలెం ఎంపీయూపీ, ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన రెంటచింతలలో విలేకర్లతో మాట్లాడారు. సెయింట్ జోసఫ్స్ హైస్కూల్, వైఆర్ఎస్ హైస్కూల్, సెయింట్ ఆన్స్, ఫాతిమా విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని మూడు జెడ్పీ, మూడు ఎయిడెడ్‌తో పాటు మరో ఐదు ప్రయివేటు పాఠశాలలకు చెందిన మొత్తం 814 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతారన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తుమ్మకోట నుంచి పాలువాయి మీదుగా ఒక బస్సును, మల్లవరం నుంచి జెట్టిపాలెం, గోలి, మిట్టగుడిపాడు మీదుగా మరోక బస్సును, మంచికల్లు నుంచి పాలువాయిగేటు మీదుగా మూడవ బస్సును రెంటచింతలలోని పరీక్ష కేంద్రాల వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బి. వీరాస్వామికి వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. హాల్ టికెట్టు చూపించి విద్యార్థులు బస్‌లో పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు.



జెట్టిపాలెం ఎంపీయూపీలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఎంఈవో-2 శివనాగేశ్వరావు

మాతృభాషను మరువకూడదు

రెంటచింతల: మాతృభాషను మరువకూడదని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం పాఠశాలలో నిర్వహించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులతో కలిసి సరస్వతిదేవి, కన్నెగంటి హనుమంతు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాతృభాష విశిష్టతను వివరించారు. విద్యార్థులతో మాతృభాష పరిరక్షణకు కంకణం కట్టుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంచికల్లు గ్రామ పెద్దలు గోగుల వెంకటరామిరెడ్డి, సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మోహన్ క్రీడాభివృద్ధికి చేయుత నందించిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గోగుల మహేశ్వరరెడ్డి, పల్లెర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సరస్వతిదేవి, కన్నెగంటి హనుమంతు చిత్ర పటాలకు నివాళి

సుబాబుల్ వ్యాపారిపై టీడీపీ నేతల దౌర్జన్యం

కర్ర అమ్మకుండా అడ్డుకుంటున్న వైనం

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో సుబాబుల్ వ్యాపారం చేసుకునే వ్యక్తిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు వ్యవసాయంతో పాటూ వేసవిలో సుబాబుల్ తోటలు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుంటాడు. నెల క్రితం కొన్ని తోటలు కొట్టి సుమారు వంద టన్నులకు పైగా కర్రను గ్రామం వెలుపల పొలాల్లో, రోడ్డు పక్కన నిల్వ ఉంచాడు. అయితే కర్రను లోడింగ్ చేసేందుకు ఒప్పుకునేది లేదంటూ టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. నువ్వు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడివని, నిన్ను వ్యాపారం చేసుకోనివ్వమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అంతేకాక లారీ యజమానులు, హమామీలకు ఫోన్ చేసి ఎండుగుంపాలెం గ్రామానికి రావొద్దంటూ హెచ్చరించారు. దీంతో శ్రీనివాసరావు గ్రామంలోని పలువురు టీడీపీ నాయకులను సంప్రదించి బ్రతిమాలుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఎండుగుంపాలెంలో నిల్వ ఉంచిన కర్ర

వసతి గృహంలో ముఖ హాజరు అమలు

నూజెండ్ల: నూజెండ్ల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ముఖహాజరు (ఫెస్ రికగ్నైజేషన్ సిస్టిం ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని ప్రభుత్వం అమలు చేసినట్లు వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ విధానంలో ఉదయం అల్పాహారం సమయానికి ముందు సాయంత్రం స్కూలు సమయం తర్వాత ప్రతిరోజు విద్యార్థుల హాజరును నమోదు చేయాల్సి ఉందన్నారు. హాస్టల్లో మొత్తం 91 మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారన్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా కచ్చితమైన విద్యార్థుల సంఖ్య ప్రభుత్వానికి చేరుతుందన్నారు. గతంలో ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య వారి హాజరుకు వ్యత్యాసం భారీగా ఉండేది. ఇటువంటి అక్రమణాలను అడ్డుకునేందుకు ముఖ హాజరు ఎఫ్ఆర్ఎస్‌ను ఫిబ్రవరి 1 నుంచి నూతన విధానం అమల్లోకి వచ్చిందని వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బోగస్, అక్రమాణాలకు అడ్డుకట్ట వేసినప్పటికీ సర్వర్ సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు.



వసతి గృహంలో ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

నేడు కంటి వైద్య శిబిరం

గురజాల: ట్రెజరీ పరిధిలోని పెన్షన్‌దారులకు శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు చిట్టెం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నరసరావుపేట రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి హెల్త్ కార్డుపై ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. పాత పెన్షనర్ హెల్త్ కార్డు, ఆధార్ కార్డుతో లింకు చేయబడిన సెల్ ఫోన్ వెంట తీసుకురావాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం



పిడుగురాళ్ల: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాయలంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణాల దశలను వెంటనే గుర్తించాలని తెలిపారు. పూర్తయిన వాటి సమాచారం సేకరించాలన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బంగారయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే కోలేజియేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని బంగారు పతకం సాధించినట్టు కళాశాల ఫిజికల్ ఎడ్యూకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు తెలిపారు. చీరాల సెంట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 17వ తేదీన నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం చివరి సంవత్సరం విద్యార్థిని జి.నాగసాయి గీతిక పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు పేర్కొన్నారు. 81 కేజీల వెయిట్ కేటగిరిలో బంగారు పతకం సాధించినట్టు వివరించారు. పతకం సాధించిన గీతికను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు, ఫిజికల్ ఎడ్యూకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

గురజాల రూరల్ : సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగిఉండాలని సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మంచి విద్యనభ్యసించి మెరుగ్గా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.వినోద్ కుమార్, ప్రిన్సిపల్ నాయక్ తదితరులున్నారు.

బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు

నూజెండ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని ముప్పరాజువారిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల మేరకు నూజెండ్ల గ్రామానికి చెందిన ఏసోబు స్వగ్రామం నుంచి ఉల్లగల్లు గ్రామానికి తన బైకుపై వెళుతుండగా ముప్పరాజువారిపాలెం కాల్వ కట్ట సమీపంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు.

ఎమ్మెల్యేనయ్యా..ఖాళీ చేయించమంది

పిడుగురాళ్ల: జీవనోపాధి పొందే వ్యాపార సముదాయాలను తొలగిచాలంటూ పోలీసులు, మున్సిపల్ అధికారులు హుకుం జారీ చేయడంతో చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్య గోచరమైంది. మూడు రోజుల నుంచి పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద రేకుల షెడ్డులో చిరు వ్యాపారం చేసుకునే వారిని ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు వేధిస్తున్నారు. శుక్రవారం ఏకంగా పొక్లెయినర్‌తో దుకాణాలను తొలగించేందుకు రావడంతో.. చిరు వ్యాపారులు మరికొంత సమయం కావాలని ప్రాధేయపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసుకుంటున్నామని చెప్పడంతో..అసలు ఎమ్మెల్యేనే ఖాళీ చేయమన్నాడని, ఈ స్థలం కోసం, అందులో కారు పార్కింగ్‌కు దుకాణాలు ఖాళీ చేయాలని ఆయనే చెప్పారని అధికారులు వెల్లడించారు. శనివారం నాటికి స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని హుకుం జారీ చేసి, అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



దుకాణాలను ఖాళీ చేయాలని తెలుపుతున్న అధికారులు

ముమ్మరంగా మహా శివరాత్రి ఏర్పాట్లు

సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం నందు ఫిబ్రవరి 26న మహా శివరాత్రి వేడుకల నిర్వహణకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే లక్షలాది మంది భక్తులు ఏలాంటి ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికేడ్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతితో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేవస్థానం నందు విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండటానికి అదనపు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో మహా శివరాత్రికి తరలివచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మహా శివరాత్రి రోజు భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతియువకులు వాలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఆసక్తి కలిగిన వారు 99496 46208, 77801 34383 నంబర్లను సంప్రదించాలన్నారు.



కృష్ణానదిలో భక్తుల స్నానానికి ఏర్పాట్లు

పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలి

మస్టర్‌ను పరిశీలించి సూచించిన మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని మూడు, నాలుగు డివిజన్లకు చెందిన కార్మికుల హాజరు ప్రక్రియ (మస్టర్) పరిశీలించారు. వర్కర్లు అందరూ తమకు కేటాయించిన సమయం ఉదయం 5.30 నుంచి10.30 వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదుగంటల వరకు బాధ్యతగా పనిచేయాలన్నారు. వార్డు పర్యవేక్షణ కార్యదర్శులు తమ పరిధిలోని చెత్త పడేసే పాయింట్లలో చెత్తను పూర్తిగా తొలగించి ఆ ఫొటోలను గ్రూపులో పంపించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వచ్చే కోటప్పకొండ తిరునాళ్లను పురస్కరించుకొని వర్కర్లు, మేస్త్రీలు, పర్యావరణ కార్యదర్శులచే సక్రమంగా పనిచేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. పార్కులు, ఫౌంటేన్‌లు తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు.



పట్టణంలో తెల్లవారుజామునే మస్టర్ పరిశీలిస్తున్న కమిషనర్